సాక్షి ప్రకాశం

గురువారం । 5 । అక్టోబర్ । 2023



మహిళల ఉన్నతికి ప్రోత్సాహం

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. - 8లో..



హత్య కేసులో నిందితులు అరెస్టు

2005లో మన్నం దైవప్రసాద్ హత్య కేసులో ప్రధాన నిందితులు కుంట యాదగిరి, జెల్లా సత్యన్నారాయణను అరెస్టు చేసినట్లు సీఐ దాచేపల్లి రంగనాథ్ తెలిపారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
37.3/25.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు అండర్-19 జిల్లా జట్ల ఎంపిక

సింగరాయకొండ: అండర్-19 జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 6వ తేదీ శుక్రవారం స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ కె.రాజశేఖర్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని జూనియర్ కాలేజీల వాలీబాల్, టెన్నికాయిట్, షటిల్ బాడ్మింటన్ విభాగాల్లో బాలబాలికల క్రీడా జట్ల ఎంపిక చేస్తామని పీడీ కె.శంకర్రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో అండర్-19 జిల్లా కార్యదర్శి కె. ఆదినారాయణ పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు 9848125706 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రేపు వైఎస్సార్ సీపీ జిల్లాస్థాయి విస్తృత సమావేశం

ఒంగోలు: వైఎస్సార్ సీపీ జిల్లాస్థాయి విస్తృత సమావేశం ఈ నెల 6న ఉదయం 10 గంటలకు స్థానిక ఎంఎస్ ఫంక్షన్ హాలులో జరగనుంది. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని సారథ్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నారు. ప్రధానంగా రాష్ట్రానికి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఏంటి, ఆయన సీఎంగా ఎందుకు కావాలనే అంశంతో పాటు జగనన్న ఆరోగ్య సురక్ష అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. జిల్లాలోని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు, నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, జేసీఎస్ మండల ఇన్‌చార్జులు, ఏఎంసీ చైర్మన్, ఒంగోలు మేయర్, ఒడా చైర్మన్, పట్టణ అధ్యక్షుడు, ఒంగోలు నగర అధ్యక్షునితో పాటు జేసీఎస్ టౌన్ ఇన్‌ఛార్జులు హాజరు కావాలని పార్టీ జిల్లా కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది.

35 సార్లు రక్తదానం



రక్తదానం చేస్తున్న చల్లా అశోక్‌రెడ్డి

కొమరోలు: మండలంలోని నల్లగుంట్ల గ్రామానికి చెందిన మేమున్నాము సేవా సమితి అధ్యక్షుడు చల్లా అశోక్‌రెడ్డి 35వ సారి బుధవారం రక్తదానం చేశారు. నంద్యాల పట్టణంలోని కేవీఆర్ వైద్యశాలలో బనగానిపల్లె గ్రామానికి చెందిన 13 సంవత్సరాల సందీప్ అనారోగ్యం బారిన పడటంతో చల్లా అశోక్‌రెడ్డి ఈ విషయం తెలుసుకుని నంద్యాల బ్లడ్ సెంటర్ వద్ద రక్తదానం చేశారు. ఇప్పటి వరకు 35 సార్లు రక్తదానం, 4 సార్లు రక్తకణాలు ఇచ్చినట్లు తెలిపారు. యువకులందరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అశోక్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

చింత తీరింది..

గత టీడీపీ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా మోసం చేస్తే.. రైతులకు పంట పెట్టుబడి సాయం దగ్గర నుంచి.. పండించిన పంటను గిట్టుబాటు ధర వచ్చేలా చేయడం వరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తోడుగా ఉంటోంది. ఆధునిక వ్యసాయ పనిముట్లు అందజేస్తుండడంతో రబీ, ఖరీఫ్ సీజన్లలో పంటల సాగుకు ఉపయోగపడుతోంది. జిల్లాలో 616 కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ) ద్వారా 363 ట్రాక్టర్లు, 5219 వివిధ రకాల యంత్రాలు, పనిముట్లను వ్యవసాయశాఖ అధికారులు అందించారు.



- వైఎస్సార్ యంత్రసేవా పథకం రైతులకు వరం
- ఖరీఫ్‌లో అందుబాటులోకి వ్యవసాయ పనిముట్లు
- 616 సీహెచ్‌సీ సెంటర్ల ద్వారా రైతులకు పంపిణీ
- 363 ట్రాక్టర్లు.. 5219 పనిముట్లు అందచేత
- రైతులకు రూ. 20.83 కోట్ల సబ్సిడీ

మార్కాపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నదాతల జీవితాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చింది. మూడేళ్ల కిందట ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యంత్రసేవా పథకం ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు పంటల సాగుకు ఉపయుక్తంగా మారింది. జిల్లాలో మొత్తం 616 రైతు భరోసా కేంద్రాలున్నాయి. ఇందుకు అనుగుణంగా 616 సీహెచ్‌సీ (కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు) ఏర్పాటుచేసి ఆ గ్రూపులకు వ్యవసాయశాఖ ద్వారా వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా ట్రాక్టర్లు, ట్రక్కులు, గొర్రులు, నాగళ్లు, విత్తనపు గొర్రులు, తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లు, రొటోవేటర్లు, నూర్పిడి యంత్రాలను అందచేశారు. సాధారణంగా ఈ యంత్రాలు రైతులకు కావాలంటే వేల రూపాయలు అద్దెలు చెల్లించాలి. ఇటువంటి పరిస్థితుల్లో రైతులకు నామమాత్రపు రుసుంతో వ్యవసాయ పనిముట్లను అందించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ యంత్రసేవా పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో ఐదుగురు రైతులు ఒక గ్రూపుగా ఏర్పడితే రూ.15 లక్షల విలువైన యంత్రాలను ప్రభుత్వం అందిస్తోంది. ఇందులో 40శాతం సబ్సిడీ, 50శాతం బ్యాంకు లోను, 10శాతం గ్రూపు వాటాగా రైతులు చెల్లిస్తే ట్రాక్టర్లతో ఆధునిక వ్యవసాయ పనిముట్లను అందిస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకూ 2021 - 2023 వరకూ మొత్తం 363 ట్రాక్టర్లను, 5582 వ్యవసాయ యంత్రాలు, పనిముట్లను రైతులకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అందించారు. ఇందుకోసం మొత్తం 59.69 కోట్ల రూపాయలు ఖర్చుకాగా ప్రభుత్వం రైతులకు 20.83 కోట్ల రూపాయల సబ్సిడీ అందించింది. అత్యధికంగా మార్కాపురంలో 20, కనిగిరిలో 17, త్రిపురాంతకంలో 16, దర్శిలో 15, కొనకనమిట్ల 13, నాగులుప్పలపాడు, ఒంగోలులో 12, గిద్దలూరు, ముండ్లమూరు, కొండేపి, పెద్దారవీడు, పుల్లలచెరువు, యర్రగొండపాలెం, సంతనూతలపాడులో 10, బేస్తవారిపేట, సీఎస్‌పురం, దొనకొండ, దోర్నాల, హెచ్‌ఎంపాడు, కొమరోలు, తర్లుపాడు మండలాలకు 10 చొప్పున ట్రాక్టర్లను అందచేశారు. ఇంకా మిగిలిన మండలాలకు కూడా రైతుల అవసరాన్ని బట్టి ట్రాక్టర్లను అందచేశారు.



రైతులకు ట్రాక్టర్లు అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ (ఫైల్)



వైఎస్సార్ యంత్రసేవా పథకం కింద అందించిన గొర్రులు

వ్యవసాయ పనిముట్లు

సీహెచ్‌సీలకు వ్యవసాయ పనిముట్ల అందచేతలో భాగంగా జిల్లాలో అత్యధికంగా నాగులుప్పలపాడులో 343, కనిగిరిలో 329, దర్శిలో 284, మర్రిపూడిలో 230, జరుగుమల్లిలో 207, పొన్నలూరు 196, సంతనూతలపాడులో 172, తాళ్లూరులో 183, గిద్దలూరులో 140, మార్కాపురం, పీసీపల్లిలో 134, బేస్తవారిపేటలో 112 వ్యవసాయ పనిముట్లను సీహెచ్‌సీల ద్వారా అందించారు. ఇంకా మిగిలిన మండలాలకు కూడా అవసరాన్ని బట్టి సరఫరా చేశారు.

రైతులకు చాలా ఉపయోగకరం



జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ యంత్రసేవా పథకం కింద ఇప్పటి వరకూ 363 ట్రాక్టర్లను అందించాం. మొత్తం రూ.26.32 కోట్లు కాగా ఇందులో రూ.9.42 కోట్ల సబ్సిడీ రూపంలో అందించాం. మొత్తం 5582 వ్యవసాయ పనిముట్లకు రూ.59.69 కోట్ల ఖర్చు కాగా సబ్సిడీ కింద రూ.20.83 కోట్లు అందించాం. రైతులు తమ స్వగ్రామంలోనే నామమాత్రపు అద్దెలతో తమ కావాల్సిన వ్యవసాయ పనిముట్లను సీహెచ్‌సీలకు చెల్లించి వాడుకుంటున్నారు.

- శ్రీనివాసరావు, జేడీఏ

స్వగ్రామంలోనే వ్యవసాయ పనిముట్లు



వైఎస్సార్ యంత్రసేవా పథకం రైతులకు చక్కగా ఉపయోగపడుతోంది. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు స్వగ్రామంలోనే తోటి రైతులు ఏర్పాటు చేసుకున్న సీహెచ్‌సీల వద్ద ఉన్న విత్తనలు గొర్రులు, ట్రాక్టర్లు, స్ప్రేయర్లను ఉపయోగించుకుంటున్నారు. బయట ధరకంటే తక్కువ ధరకే సీహెచ్‌సీల నిర్వాహకులు రైతులకు ఇస్తున్నారు. గతంలో ట్రాక్టర్లు ఇతర ప్రాంతాల నుంచి అధిక అద్దెలు చెల్లించి తెచ్చుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. స్వగ్రామంలోనే రైతులకు అందుబాటులో ఉన్నాయి.

- శ్రీనివాసరెడ్డి, ఏఓ, మార్కాపురం

చాలా ఉపయోగకరంగా ఉంది



వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా ఈ ఏడాది మా గ్రామానికి వచ్చిన వ్యవసాయ పనిముట్లను ఉపయోగించుకున్నాను. తక్కువ అద్దెతో పొలాన్ని సాగుచేసుకున్నాను. పత్తి, మిర్చి వేశాను. ట్రాక్టర్లు, స్ప్రేయర్లు ఉపయోగపడుతున్నాయి.

- వెన్నా వెంకటరెడ్డి, రామచంద్రాపురం

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు

- కలెక్టర్ దినేష్ కుమార్

టంగుటూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు అందుతాయని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక 4వ సచివాలయ పరిధిలోని భాష్యం స్కూల్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ దినేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష గురించి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించి వైద్య శిబిరాలకు తీసుకురావాలన్నారు. శిబిరంలో పరీక్షించిన తరువాత అవసరమైతే జిల్లా ఆస్పత్రికి లేదా, ఆరోగ్యశ్రీ ఉన్న కార్పొరేట్ వైద్యశాలలో చేర్పించి వైద్యం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దేశంలో ఎక్కడా కూడా ఇటువంటి బృహత్తర కార్యక్రమం లేదన్నారు. పేదల కోసం నిరంతరం తపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీఓ మల్లీశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవరావు, ఎంపీడీఓ రత్నజ్యోతి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, కొండపి ఏఎంసీ డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సేవల గురించి అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

16 నుంచి కొత్త ఈవీఎంల పరిశీలన

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రానున్న ఎన్నికలకు జిల్లాకు కొత్తగా వచ్చిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను ఈ నెల 16వ తేదీ నుంచి సంబంధిత ఇంజినీర్లతో రాజకీయ పార్టీల సమక్షంలో పరిశీలిస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. ప్రకాశంభవనంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులతో కలిసి బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా వచ్చిన ఎన్నికల యంత్రాలను పీఎఫ్‌సీఎల్ అనే కొత్త పరికరం ద్వారా వాటి నాణ్యత, పనితీరును బెంగళూరు బెల్ కంపెనీ ఇంజినీర్లు పరిశీలిస్తారన్నారు. ఈ ప్రక్రియ సుమారు నెల రోజుల పాటు కొనసాగుతుందన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో వీటిని వినియోగించాల్సి ఉండటంతో పూర్తి స్థాయిలో పరిశీలించి సిద్ధం చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు కాలేషాబేగ్, రాజశేఖర్, సత్యం, రసూల్ పలువురు అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ దినేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న రాజకీయ పార్టీల ప్రతినిధులు

కలెక్టర్‌కు సత్కారం..

సమావేశం అనంతరం వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టరేట్‌కు ఐఎస్ఓ గుర్తింపు తీసుకురావడంలో కృషి చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్‌ను సన్మానించారు.

నకిలీ డాక్యుమెంట్లపై దర్యాప్తు ముమ్మరం

- జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు
- బాధితుల ఫిర్యాదులు స్వీకరించేందుకు శనివారం ప్రత్యేక సమయం కేటాయింపు
- దర్యాప్తు బృందంతో జాయింట్ కలెక్టర్ సమావేశం

ఒంగోలు అర్బన్: నకిలీ డాక్యుమెంట్లతో భూ కబ్జాలకు పాల్పడుతున్నట్లు నమోదైన కేసులో కలెక్టర్ దినేష్‌కుమార్ దర్యాప్తు వేగవంతం చేశారు. ఆ మేరకు జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన దర్శి డీఎస్పీ, జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్, ఒంగోలు ఆర్డీఓలతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రకాశంభవనంలో కమిటీ సభ్యులతో బుధవారం జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ స్టాంప్ పేపర్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల ద్వారా నష్టపోయిన బాధితులు ఉంటే అటువంటి వారు శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల లోగా ఒంగోలులో జాయింట్ కలెక్టర్, కనిగిరిలో ఆర్డీఓ, మార్కాపురం డివిజన్‌లో అయితే సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రత్యేక సమయం కేటాయించిమన్నారు. నకిలీ డాక్యుమెంట్ల కేసులో స్వాధీనం చేసుకున్న స్టాంప్ పేపర్‌లు, రిజిస్ట్రేషన్ ఇతర ధృవీకరణ పత్రాల వాస్తవికతను పరిశీలించి నివేదిక అందచేయాలన్నారు. సంబంధిత శాఖ నుంచే స్టాంప్ పేపర్‌లు సరఫరా అయ్యాయా, రిజిస్ట్రేషన్ పత్రాల్లో ఉన్న సర్వే నంబర్లు, వాటి వాస్తవికతను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ ప్రక్రియలో రెవెన్యూ అధికారులు, జిల్లా రిజిస్ట్రార్, ఒంగోలు మున్సిపల్ కమిషనర్‌లు సమన్వయంతో పనిచేయాలన్నారు. నకిలీ డాక్యుమెంట్ కేసులో సంబంధం ఉన్న వారందరినీ రెండు వారాల్లోగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రిజిస్ట్రేషన్ డీఐజీ లత, ఆర్డీఓ విశ్వేశ్వరరావు, దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, ఒంగోలు తహశీల్దార్ మురళి, తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డి, ఒంగోలు సబ్ రిజిస్ట్రార్, అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చైతన్యంతోనే పేదరిక నిర్మూలన



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మాజీ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్

- మాజీ ఐఏఎస్ అధికారి విజయకుమార్

కొత్తపట్నం: విద్య, వైద్య, ఆర్థిక, రాజకీయ పరంగా ప్రతి ఒక్కరూ చైతన్యవంతులైతేనే పేదరిక నిర్మూలన సాధ్యమని మాజీ ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్‌కేఆర్ విజయకుమార్ అన్నారు. మండలంలో బుధవారం రెండో రోజు ఐక్యతా విజయపథం యాత్ర కొనసాగింది. తొలుత ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఆయనకు మేళతాళాలతో స్వాగతం పలికారు. రాజుపాలెం, వజ్జిరెడ్డిపాలెం, గమళ్లపాలెం గ్రామాల్లో సాగిన యాత్రలో పలు విషయాలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గమళ్లపాలెం సచివాలయాన్ని విజయకుమార్ సందర్శించి సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. ఆధార్‌కార్డుల మార్పులు సక్రమంగా చేయాలన్నారు. వజ్జిరెడ్డిపాలెంలో పూలు అల్లుతున్న మహిళలతో మాట్లాడి పూలు అమ్మితే ఎంత ఆదాయం వస్తుందో అడిగి తెలుసుకున్నారు. మంత్ర రోశయ్య అనే వ్యక్తి మాట్లాడుతూ మీరు కలెక్టర్‌గా పనిచేసినప్పుడు నిర్వహించిన అక్షర ప్రకాశం వల్ల తామంతా అక్షరాస్యులుగా మారమని తెలిపారు. అనంతరం డీటీ, చాకిరేవుమిట్ట యానాది కాలనీల్లో పర్యటించారు. ఆ కాలనీల్లో సీసీ రోడ్లు, ఇళ్లకు కుళాయిలు లేవని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కొత్తపట్నంలో క్రిష్టియన్‌పాలెం, అంబేడ్కర్ కాలనీ, ఎస్టీ కాలనీ ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రంగాయపాలెం ఎస్టీ కాలనీ, పాదర్తి అంబేడ్కర్ నగర్, మోటుమాల ఎస్టీ, ఎస్సీ కాలనీ, బీరంగుంట గ్రామస్తులతో మాట్లాడారు. మత్స్యకార గ్రామాల్లో ఎక్కువ మంది పేదలే కనిపిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఐకమత్యంగా కలిసి ముందుకు సాగితే గౌరవంగా జీవించవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, బిల్లా చెన్నయ్య, దోనెంపూడి రవి, పట్టపు ప్రభాకర్, గుమ్మళం పాటి నరసమ్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ ఫలాలు

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

హనుమంతునిపాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు విరజిమ్ముతున్నాయని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. మండలంలోని వేములపాడు సచివాలయ పరిధిలోని మహ్మదాపురం, రాజుగారిపల్లి గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేవా అడిగి తెలుసుకొని బుక్‌లెట్ అందజేశారు. అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, జగనన్న ఇళ్లు, విద్యా దీవెన, రైతు భరోసా, పంటల బీమా వంటి పథకాలు పొందిన లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాల అమలులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ఇంటికే సంక్షేమ పథకాలు వచ్చేలా చేశారన్నారు. నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలన్నీ కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా తీర్చిదిద్దారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారని తెలిపారు. టీడీపీ హయాంలో దోచుకోవడం తప్ప ప్రజల సంక్షేమం గురించి ఏనాడు పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. ఎంపీపీ గాయం సావిత్రి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, సర్పంచ్ పల్లపోలు రత్న, వైస్ ఎంపీపీలు కొదమల బెంజి, రుద్రపాటి శోభ, యూత్ అధ్యక్షుడు భవనం క్రిష్టారెడ్డి, రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేశపోగు గురుప్రసాదు, సచివాలయ కన్వీనర్ మద్ది తిరుపతయ్య, మండల మహిళా అధ్యక్షురాలు కాస్తల బేబి, ఆర్యవైశ్య సంఘ నాయకలు చెక్కా రాము, ప్రతాపు, మండల సర్పంచ్ సంఘ అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ సిలార్ బాష, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మహమ్మదాపురంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

క్లుప్తంగా

ప్రేమకు ఎస్.. పెళ్లికి నో!

● బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు

మార్కాపురం: ప్రేమ పేరుతో దగ్గరై పెళ్లి ప్రస్తావన రాగానే ముఖం చాటేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై సువర్ణ బుధవారం తెలిపారు. మార్కాపురం పట్టణంలోని విజయటాకీస్ ఏరియాలో నివశిస్తున్న ముస్లిం యువకుడికి తర్లుపాడు మండలం సీతానాగులవరానికి చెందిన యువతితో పరిచయం ఏర్పడింది. వీరి స్నేహం ప్రేమగా మారింది. యువతి తరఫు బంధువులు పెళ్లి ప్రస్తావన తీసుకురాగానే విభేదాలు తలెత్తాయి. ఇద్దరి కులాలు వేరంటూ, తనను కులంపేరుతో దూషించాడని, పెళ్లిచేసుకోకుండా మోసగించాడని యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయంలో చోరీ

కనిగిరి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గుర్తు తెలియని దుండగులు బుధవారం చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. ఎంపీడీఓ కార్యాలయంలోని బోర్‌వెల్ పైపులు, ఇతర సామగ్రి నిల్వ ఉంచే గది తాళాన్ని దొంగలు పగలగొట్టారు. సుమారు రూ.50 వేల విలువ చేసే ఫిట్టింగ్ సామగ్రిని అపహరించారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రమ మద్యం కేసులో ముగ్గురికి జైలు

దర్శి: అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడిన ముగ్గురు నిందితులకు దర్శి జేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ బుధవారం జైలు శిక్ష విధించినట్లు దర్శి సెబ్ ఇన్‌స్పెక్టర్ బి.సుందరరామయ్య తెలిపారు. తాళ్లూరు మండలం దారంవారిపాలేనికి చెందిన జి.నాగార్జునరెడ్డి, తూర్పుగంగవరానికి చెందిన వెంకటేశ్వర్లు, బొద్దికూరపాడు గ్రామానికి చెందిన శివారెడ్డి తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తీసుకొస్తూ 2020 జూలై 22వ తేదీన సెబ్ పోలీసులకు పట్టుబడ్డారు. ముగ్గురు నిందితులపై నేరారోపణలు రుజువు కావడంతో వారికి 12 నెలల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

9న అధిక జన ఆకాంక్ష సదస్సు

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన మాజీ ఐఏఎస్ జీఎస్ఆర్ కెఆర్ విజయ్‌కుమార్ ఒంగోలు చర్చిసెంటర్‌లో నిర్వహించ తలపెట్టిన కార్యక్రమానికి అధిక జన ఆకాంక్ష సదస్సు అని నామకరణం చేసినట్లు ఐక్యతా విజయపథం టీం సభ్యులు బుధవారం ప్రకటించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దళిత సంఘ నాయకుడు విజయేంద్ర బహుజన్, బీసీ సంఘ నాయకుడు మిరియం శ్రీనివాసులు, వీకేసీ జిల్లా నాయకులు ఆదినారాయణ, ఏపీ మాలమహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బిళ్లా చెన్నయ్య, రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల సంఘ నాయకుడు ప్రభుదాస్, సర్పంచుల సంఘ నాయకుడు వీరభద్రాచారి తదితరులు విజయ్‌కుమార్ చేపడుతున్న ఐక్యతా విజయపథం కార్యక్రమ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఇప్పటి వరకు 950 కిలమీటర్లకుపైగా విజయకుమార్ పాదయాత్ర చేశారన్నారు. మెజార్టీ ప్రజల రాజ్యాంగపరమైన హక్కుల కోసం ఒక మాజీ ఐఏఎస్ అధికారి పాదయాత్ర చేయడం అరుదైన విషయమని పేర్కొన్నారు. ఐక్యతా విజయపథం ద్వారా ప్రజలకు నాయకత్వం అందించడమే లక్ష్యంగా ఆయన పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 9న సాయంత్రం 4గంటలకు ఈ యాత్ర అద్దంకి బస్టాండుకు చేరుకుంటుందని, అక్కడ నుంచి 5 గంటలకు ర్యాలీగా చర్చి సెంటర్‌కు వస్తారన్నారు. ఈ కార్యక్రమానికి అధిక జన ఆకాంక్ష సదస్సుగా నామకరణం చేసినట్లు తెలిపారు. సదస్సులో ఐక్యతా విజయపథం యాత్ర లక్ష్యాలు, ప్రణాళికలను విజయకుమార్ వెల్లడిస్తారని చెప్పారు.

మహిళల ఉన్నతికి ప్రోత్సాహం



పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, వరికూటి అశోక్‌బాబు



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్, అశోక్‌బాబు

● ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
● జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సూచన
● టంగుటూరులో పెరటికోళ్లు, కుట్టుమిషన్లు, రుణాలు పంపిణీ

టంగుటూరు: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో పెరటి కోళ్లు, కుట్టు మిషన్లు, రుణాలు, కారు పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ దినేష్ కుమార్, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి ఆశోక్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వైఎస్సార్ క్రాంతి పథం టంగుటూరు సమాఖ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ పెరటి కోళ్ల పథకం కింద 100 యూనిట్లు పంపిణీ చేశారు. మూడు రకాల కుట్టు మిషన్ల యూనిట్లు 12, పీఎంఈజీపీ పథకం కింద 8 మంది లబ్ధిదారులకు రూ.60 లక్షల రూపాయల విలువ చేసే టెంట్ హౌస్, డైరీ యూనిట్లను బ్యాంకు తరపున అందించారు. అలాగే జగనన్న బడుగు వికాసం పథకం కింద ఒక లబ్ధిదారుడికి రూ.10 లక్షల విలువ చేసే కారును 45 శాతం సబ్సిడీపై బ్యాంకు సహకారంతో అందజేశారు. 7 పొదుపు సంఘాలకు రూ.1,30,00,000 బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, డీఆర్డీఏ పీడీ రవికుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, డీపీఎంలు డేవిడ్, సుబ్బారావు, కొండపి ఏరియా కోఆర్డినేటర్ సనిత, ఏపీఎం హనుమంతురావు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు సుగంధ పంటల సాగు

● కలెక్టర్ దినేష్‌కుమార్



వ్యవసాయశాఖపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లా సుగంధ పంటల సాగును ప్రోత్సహించాలని ఉద్యాన శాఖ అధికారులను కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో ఉద్యాన శాఖతోపాటు పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. లెమన్‌గ్రాస్, పామరోజా, వట్టివేరు తదితర సుంగంధ పంటలకు ఎంజీఎన్ ఆర్ఈజీఎస్ కింద ఆర్థిక సహాయం అందించాలని తెలిపారు. ప్రతి ఉద్యాన అధికారి నిర్దేశించిన లక్ష్యం మేరకు వారి పరిధిలో 100 ఎకరాలకు తగ్గకుండా సాగును ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. ఎంపిక చేసిన రైతులకు నాణ్యమైన విత్తనాలు అందచేయాలని చెప్పారు. సుగంధ పంటలు పండించే రైతులకు అవసరమైన రాయితీలు అందించాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులకు గిద్దలూరులో ప్రాంతంలో సాగులో ఉన్న సుగంధ పంటల క్షేత్ర సందర్శన ఏర్పాటు చేస్తున్నట్లు ఉద్యాన అధికారి గోపిచంద్ వివరించారు. సమావేశంలో ఏపీఎంఐపీ పీడీ పీవీ రమణ, డ్వామా పీడీ శీనారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసులు, ఉద్యాన శాఖ డీపీఎం సుభాషిణి, శ్రీలక్ష్మి, ప్రత్యూష, తేజ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

● 18 ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులు
● ఎట్టకేలకు జాడ కనిపెట్టిన పోలీసులు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ రంగనాథ్

సింగరాయకొండ: ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని పీడీసీసీ బ్యాంకులో 2005వ సంవత్సరంలో మన్నం దైవప్రసాద్ హత్య కేసులో ప్రధాన నిందితులు కుంట యాదగిరి, జెల్లా సత్యన్నారాయణను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ దాచేపల్లి రంగనాథ్ తెలిపారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ వెల్లడించారు. యాదగిరి స్వగ్రామం తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా తూఫ్రాన్ మండలం ఇస్లాంపురం గ్రామం కాగా ప్రస్తుతం మేడ్చల్ జిల్లా కేసర్ మండలం దమ్మాయగూడలో నివాసం ఉంటున్నాడు. మరో నిందితుడు సత్యన్నారాయణ స్వగ్రామం తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా భువనగిరి మండలం ప్రగతినగర్ గ్రామం కాగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ వీధిలో నివసిస్తున్నాడు. వీరిద్దరూ 18 సంవత్సరాలుగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్నారు. ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాలతో డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టి ఇద్దరు నిందితులను ఎట్టకేలకు కటకటాల్లోకి నెట్టారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐ రంగనాథ్, ఎస్సై టి.శ్రీరామ్, హెడ్ కానిస్టేబుల్ శ్రీమన్నారాయణ, రమేష్, కానిస్టేబుల్ శ్రీనివాసరావు, మహేష్‌ను ఎస్పీ మలికా గర్గ్ ప్రత్యేకంగా అభినందించినట్లు సీఐ తెలిపారు.

బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక



హ్యాండ్‌బాల్ బాలుర జట్టు

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్–19 బాలబాలికల బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించారు. హ్యాండ్‌బాల్‌కు సుమారు 40 మంది బాలురు, 25 మంది బాలికలు హాజరైనట్లు స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎం.ఆదినారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.సుబ్బారావు తెలిపారు. హాజరైన వారిలో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అదే విధంగా బాస్కెట్‌బాల్‌కు 15 మంది బాలురు, 15 మంది బాలికలు హాజరైనట్లు తెలిపారు.

ఈ జట్లు త్వరలో జరగబోయే అండర్–19 స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

మాటిచ్చాడు.. చేసి చూపించాడు

● ఇచ్చిన మాటకు కట్టుబడిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్
● గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కేపీ



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

కొనకనమిట్ల: ప్రజలకు మంచి చేస్తానని వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నీ తన పాలనలో చేసి చూపారని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మాటకు కట్టుబడిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. బుధవారం సాయంత్రం కొనకనమిట్ల మండలంలోని నాగంపల్లి సచివాలయ పరిధిలోని సలనూతల, ఎస్సీ, బీసీ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, సర్పంచ్ విడగొట్టు అంజనీకుమారి, ఎంపీటీసీ కొండ్రు వెంకటేశ్వర్లుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఏటా అర్హుల జాబితాను పెంచుకుంటూ పోవడమే తప్ప ఎక్కడా తగ్గించింది లేదన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు అందాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందిన లబ్ధిని గ్రామస్తులకు వివరించి, సమస్యలు తెలుసుకున్నారు. ముందుగా ఎమ్మెల్యే కేపీ, పార్టీ నేతలకు స్థానిక నాయకులు విడగొట్టు బాలాంజనేయులు, అన్నపురెడ్డి చిన్న ఆదిరెడ్డి, అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సానికొమ్ము రమణారెడ్డి, ముప్పా వెంకటేశ్వరరెడ్డి, కందుల విజయరావు, కోలా ధామస్‌లు అపూర్వ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, ఏపీఎం గోపాలకృష్ణారెడ్డి, సచివాలయ కార్యదర్శి నాయబ్ రసూల్, వీఆర్‌ఓ నాగరాజ, సర్పంచ్‌లు తాతిరెడ్డి చినవెంకటరెడ్డి, వడ్లమూడి మురళీమోహన్, సొసైటీ చైర్మన్లు కామసాని వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల కాశిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, తాతిరెడ్డి పెదవెంకటరెడ్డి, సైకం రమణారెడ్డి, టి.చలమారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఉన్నం శ్రీనివాసులు, ఏలూరి సంజీవరెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, స్థానిక పార్టీ నాయకులు బండారు వెంకటేశ్వర్లు, కందెర నాగయ్య, మోడి కోటేష్, పసుపులేటి పెదకోటయ్య, బత్తుల పెదవెంకటేశ్వర్లు, చిన వెంకటేశ్వర్లు, విడగొట్టు వెంకటేశ్వర్లు, చిన వెంకటయ్య, బత్తుల వెంకటరావు, ముప్పా వెంకటస్వామిరెడ్డి, ముక్కు లక్ష్మీనరసారెడ్డి, పెండెం బాబురావు, సానికొమ్ము వెంకటసుబ్బారెడ్డి, ముప్పా అంజిరెడ్డి, దేవిరెడ్డి అంజిరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో తల్లీకుమార్తెల సత్తా



సీనియర్ విభాగంలో స్వర్ణం సాధించిన అంజనీదేవి



జూనియర్ విభాగంలో రజత పథకం పొందిన నిఖితాదేవి

● తల్లి అంజనీదేవికి స్వర్ణం, కుమార్తె నిఖితాదేవికి రజతం
● అభినందనలు తెలియజేసిన ప్రముఖులు

జరుగుమల్లి: జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో తల్లీ కుమార్తెలు ప్రతిభ చాటారు. హర్యానా రాష్ట్రం రోహతక్‌లోని మహర్షి దయానందిన యూనివర్శిటీలో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించిన కుస్తీ(రెజ్లింగ్) స్టైల్ 3వ జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ తరపున సీనియర్స్ 89 కేజీల విభాగంలో జిల్లాకు చెందిన ఎస్.అంజనీదేవి ప్రాతినిధ్యం వహించారు. హర్యానా, ఢిల్లీ జట్లతో తలపడిన అంజనీదేవి జాతీయ స్థాయిలో స్వర్ణ పథకం సాధించి సత్తా చాటారు. ఆమె ఒంగోలు నగరంలోని కమ్మపాలెం సచివాలయంలో సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు.

ఏపీ తరపున జూనియర్స్ 68 కేజీల విభాగంలో ప్రాతినిధ్యం వహించిన దాసరి నిఖితాదేవి గుజరాత్, ఉత్తరప్రదేశ్ జట్లతో తలపడి రజత పథకాన్ని కైవసం చేసుకున్నారు. వీరు గ్రాప్లింగ్ కమిటీ ఇండియా చైర్మన్ దినేష్ కపూర్ చేతుల మీదుగా పథకాలు అందుకున్నారు. జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటిన తల్లీకుమార్తెలను ఏపీ గ్రాప్లింగ్ కమిటీ ఇండియా అధ్యక్షుడు ఎం.సురేంద్రారెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, కోచ్ బి.శ్రీలక్ష్మి, డీఎస్సీ కోచ్ రాజరాజేశ్వరి, కార్యదర్శి పి.సురేష్‌రెడ్డి అభినందించారు.

యూకే నుంచి స్వగ్రామానికి విద్యార్థి మృతదేహం



మృతుడు జమ్మి సుబ్బారావు (ఫైల్)

యర్రగొండపాలెం: యూకేలో గుండెపోటుతో మృతి చెందిన విద్యార్థి జమ్మి సుబ్బారావు మృతదేహం బుధవారం తన స్వగ్రామమైన వైపాలెం మండలం అమానిగుడిపాడుకు చేరింది. ఎమ్మెస్సీ పూర్తి చేసిన సుబ్బారావు యూకేలోని కార్డిఫ్‌లో ఎమ్మెస్ చేయటానికి గత నెల 7వ తేదీన అమానిగుడిపాడు నుంచి చెన్నై బయలుదేరి వెళ్లాడు. 8వ తేదీన చెన్నైలో లండన్ ఫ్లైట్ ఎక్కి కార్డిఫ్ చేరుకున్నాడు. 16వ తేదీన అక్కడి మెట్రోపాలిటిన్ యూనివర్శిటీకి స్నేహితులతో కలిసి బస్సులో బయలుదేరాడు. కార్డిఫ్ యూనివర్శిటీకి చేరేందుకు రెండు బస్సులు మారాల్సి ఉంది. సుబ్బారావు రెండో బస్సు ఎక్కడానికి సిద్ధమవుతున్న తరుణంలో అస్వస్థతకు గురయ్యాడు. సమీపంలోని షాపులో షోడా తీసుకొని తాగి అక్కడే కుప్పకూలిపోయాడు. అక్కడి పోలీసులు హాస్పిటల్లో చేర్పించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే అతను మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయాన్ని గత నెల 21వ తేదీన కన్సల్టెన్సీ ప్రతినిధుల నుంచి మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందింది. సుబ్బారావు మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

రైలు కింద పడి దివ్యాంగుడు ఆత్మహత్య



దివ్యాంగుడి మృతదేహం

ఒంగోలు టౌన్/టంగుటూరు: ఏం కష్టమొచ్చిందో.. ఎంతటి వేదన అనుభవించాడో తెలియదుగానీ ఓ దివ్యాంగుడు అందరూ చూస్తుండగానే రైలు కింద పడి తనువు చాలించాడు. ఈ విషాద ఘటన సూరారెడ్డిపాలెం రైల్వే స్టేషన్‌లో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు.. సూరారెడ్డిపాలెం రైల్వేస్టేషన్ మూడో ప్లాట్ ఫాంపై 32 ఏళ్ల వయసున్న ఓ దివ్యాంగుడు నిల్చుని ఉన్నాడు. కొద్ది సమయం తర్వాత అదే ప్లాట్‌ఫాంపైకి పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ వచ్చింది. అందరూ చూస్తుండగానే వేగంగా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ కింద పడిన దివ్యాంగుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఒంగోలు జీఆర్పీ సీఐ శ్రీకాంత్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుడు కుడి మోకాలి వరకు కృత్రిమ పాదం ఉపయోగిస్తున్నాడు. శరీరంపై పింక్ కలర్ చొక్కా ధరించి ఉన్నాడు. జీఆర్పీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.